క్లుప్తంగా

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ


ఎస్ వెంకటనరసింహ

పుట్లూరు: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా వెంకట నరసింహ బాధ్యతలను స్వీకరించారు. పుట్లూరు ఎస్ఐగా ఉన్న హేమాద్రి తిరుపతికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో తిరుపతి నుంచి వెంకట నరసింహను నియమించారు. బాధ్యతలను స్వీకరించిన అనంతరం ఆయన మండలంలోని పరిస్థితులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

నెట్టికంటుడి ఆలయంలో హోమాలు


హోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

గుంతకల్లుటౌన్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయ యాగశాలలో ఆదివారం పుష్యార్కం సందర్భంగా పంచసూక్త, మన్యుసూక్త, మూలమంత్ర హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం మెరుగు


శతాధిక వృద్ధుడు పరుశరామప్పను సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: నడక, వ్యాయామం, యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కె.వి.పరుశరామప్ప, అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసి 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం వాకర్స్ ఆత్మీయ సమావేశాన్ని భాగ్యనగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించారు. అనంతరం శతాధిక వృద్ధుడు పరుశరామప్పను సభ్యులంతా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ నారాయణస్వామి, రిటైర్డ్ తహసీల్దార్లు ఈఓ రాముడు, చలపతి, కౌన్సిలర్ ఆంజనేయులు, టీచర్లు రమణ, కాశీనాథ్, లాయర్లు భాస్కర్‌గౌడ్, జిలాన్‌బాషా, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను కేబినెట్ నుంచి తొలగించాలి


అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

గుంతకల్లుటౌన్: రాజ్యసభలో అంబేడ్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను కేంద్ర కేబినెట్ నుంచి తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు శ్రీనివాసులు, సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి వీరభద్రస్వామిలు డిమాండ్ చేశారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన అమిత్‌షాకు వ్యతిరేకంగా ఆదివారం వామపక్ష పార్టీల నాయకులు అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. అమిత్ షా గో బ్యాక్ అంటూ నినదించారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ పట్టణ కార్యదర్శులు మారుతి, గోపినాథ్, వామపక్ష నాయకులు జగ్గిలి రమేష్, నాగరాజు, కసాపురం రమేష్, రాము, దేవేంద్ర, కుళ్లాయిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవం


ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చిలలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ఆరాధనోత్సవంలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ ప్రసంగించారు. క్రీస్తుకు మహిమకరంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

నేడు 'ప్రజా వేదిక'

గార్లదిన్నె: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఈరమ్మ ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి సమస్యలు పరిష్కరించేలా చూస్తామన్నారు. కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కాలనీలో సమస్యల తిష్ట

- రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ లేక జెడ్ వీరారెడ్డి కాలనీవాసుల ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


కాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్డు

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని జెడ్ వీరారెడ్డి కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. పట్టణానికి రెండు కిలో మీటర్ల దూరంలో పది సంవత్సరాల క్రితం కాలనీ ఏర్పాటైంది. సుమారు 400 కుటుంబాలు నివాసముంటున్నాయి. కాలనీలో మౌలిక వసతులు పూర్తి గా లోపించాయి. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ పాములు బెడద అధికమైంది. ఇటీవల రెండు పాములు ఇళ్లలోకి ప్రవేశించడంతో కాలనీవాసులు భయాందోళన చెందారు. కనీసం తాగడానికి నీళ్లు కూడా లేవు. మట్టి రోడ్లతో ఇబ్బందులు పడుతున్నారు. చిన్న పాటి వర్షం వచ్చిందంటే కాలనీ బురదమయమవుతోంది. రోడ్లు అధ్వానంగా మారిపోయాయి. డ్రైనేజీలు లేకపోవడంతో మురుగు ఇళ్ల ముందు నిల్వ ఉంటుంది. వీధి దీపాల వెలగడం లేదు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల ఏర్పాటు చేయాలని దశాబ్ద కాలంగా కాలనీవాసులు సంబంధిత అధికారులకు విన్నవిస్తూనే ఉన్నారు. అయితే ఎలాంటి ప్రయోజనం లభించలేదు. పిల్లలు పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాలంటే సుమారు రెండు కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. మౌలిక వసతులు కల్పించాలని కాలనీవాసులు పలుమార్లు మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన, ధర్నా, నిరసన వ్యక్తం చేశారు. అయినా మున్సిపల్ అధికారులు స్పందించలేదు. పాలకులు, అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలని కాలనీవాసులు కోరారు.


నీటి ట్యాంకు వద్ద పేరుకుపోయిన అపరిశుభ్రత

డ్రైనేజీలు నిర్మించాలి



కాలనీలో డ్రైనేజీలు లేవు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మున్సిపల్ అధికారులకు విన్నవించాం. అయినా పట్టించుకోవడం లేదు. మురుగు నీటితో ఇబ్బందులు పడుతున్నాం. డ్రైనేజీలు నిర్మించి, పారిశుద్ధ్యం మెరుగుపరచాలి.

–శ్యామల, జెడ్ వీరారెడ్డి కాలనీ

అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల నిర్మించాలి



కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలను ఏర్పాటు చేయాలి. చిన్న పిల్లలు అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలకు వెళ్లాంటే సుమారు రెండు కిలో మీటర్లు దూరం వెళ్లాల్సి వస్తోంది. దీంతో చిన్న పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.

–షేక్ బీబీ, జెడ్ వీరారెడ్డి కాలనీ


జెడ్ వీరారెడ్డి కాలనీ

తాగునీరు కూడా లేదు



కాలనీలో తాగునీటి కొరత తీవ్రంగా ఉంది. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. ఉన్న రెండు స్పాట్ డెలివరీ ట్యాంకులపై ఆధార పడాల్సి వస్తోంది. తాగునీటి సమస్యతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించాలి.

–నిర్మల, జెడ్‌వీరారెడ్డి కాలనీ

రోడ్లు అధ్వానం



కాలనీలో రోడ్లు చాలా చాలా అధ్వానంగా ఉన్నాయి. వర్షాలు వస్తే మట్టి రోడ్లు అధ్వానంగా మారిపోతాయి. నడవటానికి కూడా వీలు ఉండదు. రోడ్లు వేయాలని పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదు.

–మల్లిక, జెడ్ వీరారెడ్డి కాలనీ

మౌలిక వసతులు కల్పిస్తాం



కాలనీలో మౌలిక వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఒక స్పాట్ డెలివరీ ట్యాంకు ఏర్పాటు చేశాం.

–జబ్బార్ మియా, మున్సిపల్ కమిషనర్, గుత్తి

కుష్టు వ్యాధి నివారణపై దృష్టి


పెద్దవడుగూరులో మాట్లాడుతున్న వైద్యులు శ్రీనివాసబాబు, అమర్‌నాథ్

పెద్దవడుగూరు: కుష్టు వ్యాధి నుంచి ప్రజలను రక్షించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెద్దవడుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రీనివాసబాబు, అమర్‌నాథ్ సూచించారు. ఆదివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లెప్రసీ నివారణపై వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2 వరకూ వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఇంటింటికి తిరిగి సర్వే చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంఓ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ శ్రీనివాసులు , పీహెచ్‌ఎన్ హేమలత, నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కుష్టు వ్యాధి సర్వే

గుత్తి రూరల్: మండల వ్యాప్తంగా సోమవారం నుంచి ఫిబ్రవరి 2 వరకూ కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే చేస్తున్నట్లు కుష్టు వ్యాధి నివారణ గుత్తి డివిజన్ అధికారి వైద్యం వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యులు ప్రవీణ్ కుమార్, దేవేంద్రనాయక్‌ల ఆధ్వర్యంలో సర్వే జరుగుతుందన్నారు. ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరినీ పరీక్షిస్తారన్నారు.

ముగిసిన పెద్దమ్మ జాతర


యల్లనూరు మండల కేంద్రంలో పెద్దమ్మ అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న దృశ్యం

యల్లనూరు: మండల కేంద్రంలో పెద్దమ్మ జాతర ఆదివారం ముగిసింది. బోనాలకు భక్తులు, మహిళలు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు హాజరై అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. శింగనమల, మడకశిర ఎమ్మెల్యేలు బండారు శ్రావణి, ఎంఎస్ రాజు, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తదితరులు పలువురు నాయకులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి విందులో పాల్గొన్నారు. డీఎస్పీ వెంకటేశులు, సీఐ సత్యబాబు, ఎస్ఐలు ధరణిబాబు (తాడిపత్రి రూరల్), విజయ్‌కుమార్ (శింగనమల), శేష గిరి(బీకేయస్), ప్రత్యేక బలగాలతో బందోబస్తు నిర్వహించారు.

వక్ఫ్‌బోర్డు ఆధీనంలో జామియా మసీదు



పామిడి: పట్టణంలోని మెయిన్‌బజార్‌లో ఉన్న సున్నీ జామియా మసీదును వక్ఫ్ బోర్డు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రహీమ్, సిబ్బంది ఇస్మాయిల్ ఆదివారం తెలిపారు. శనివారం మసీదు వద్ద వక్ఫ్‌బోర్డు నోటీసులు అతికించినట్లు వారితో పాటు మతపెద్దలు తెలిపారు. ఈమేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ వీ యుగంధర్‌కు సంబంధిత సర్క్యులర్ అందజేసినట్లు రహీమ్ తెలిపారు. ప్రస్తుతం మసీదు ముతువల్లిగా ఉన్న కమిటీ రెండేళ్ల కాలపరిమితి ముగియడంతో.. ఆ కమిటీని రద్దు పరిచామన్నారు. నూతన కమిటీ ఎంపికయ్యే వరకూ వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలోనే మసీదు మత కార్యకలాపాలు కొనసాగుతాయన్నారు.

సమస్యలు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తాం


రౌడీషీటర్లను హెచ్చరిస్తున్న సీఐ రామసుబ్బయ్య

పెద్దపప్పూరు: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో సమస్యలు సృష్టిస్తే ఎంతటి వారిపైన అయినా కేసులు నమోదు చేస్తామని సీఐ రామసుబ్బయ్య హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో మండల వ్యాప్తంగా ఉన్న రౌడీ షీటర్లను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో సమస్యలు తలెత్తితే సొంత నిర్ణయం తీసుకోకుండా ముందస్తుగా పోలీసులకు సమాచారం అందిస్తే తక్షణ చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగేంద్రప్రసాద్, ఏఎస్ఐ మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

'దేవర'లో కేతిరెడ్డి, కాకర్ల మాటామంతి


కేతిరెడ్డి, కాకర్ల గుసగుసలాడుతున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: యల్లనూరు మండల కేంద్రంలో ఆదివారం జరిగిన దేవరలో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, తాడిపత్రి టీడీపీ ముఖ్యనాయకుడు కాకర్ల రంగనాథ్ గుసగుస లాడుకోవడం తాడిపత్రి పట్టణంలో తీవ్ర చర్చాశనీయంగా మారింది. గతంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన కాకర్ల .. గత సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి టీడీపీ గూటికి చేరిన విషయం తెలిసిందే. అయితే యల్లనూరులో దేవరకు హాజరైన వీరు ఓ వీధిలో ఎదురుపడగా కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం ఒకరి చెవిలో ఒక్కరు గుసగుసలాడుకున్నారు. ఈ ఫొటోలు సామాజికమాధ్యమంలో వైరల్‌గా మారడంతో కేతిరెడ్డి, కాకర్ల మధ్య గుసగుస ఏమిటబ్బా అంటూ పలువురు చర్చించుకుంటున్నారు.

నేడు, రేపు రెండు గ్రామాల్లో 'దేవర'

గార్లదిన్నె: మండలంలోని మర్తాడు, కోటంక గ్రామాల్లో సోమవారం, మంగళవారం దేవర కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండి, పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని, గ్రామ దేవతలకు ఉత్సవం నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.

పరామర్శ


కృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యల్లనూరు: మండలంలోని తిరుమలాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణారెడ్డి భార్య శారద ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదివారం కృష్ణారెడ్డి నివాసానికి చేరుకుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కల్లూరు సూరి తదితరులున్నారు.

గుత్తి కోట క్యాలెండర్ల ఆవిష్కరణ

గుత్తి: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో నూతన సంవత్సరం గుత్తి కోట క్యాలెండర్లను ఆవిష్కరించారు. గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్, చర్చి కమిటీ సభ్యులు సునీల్, దయానంద్, విజయ శేఖర్, రీగన్, బింగి బాబు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువైద్యశిబిరాలు

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సోమవారం నుంచి పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశువైద్యాధికారి రమేష్ తెలిపారు. ఆదివారం డాక్టర్ రమేష్ మాట్లాడుతూ పాడి పశువులకు నట్టల నివారణ మందులు, దూడలు, గొర్రెలు, మేకలకు ఉచితంగా చికిత్స చేస్తామన్నారు.అలాగే పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు అందిస్తామన్నారు. ఈ నెల 20న గార్లదిన్నె, ముకుందాపురం, 21 కనంపల్లి, పెనకచెర్ల, 22న గుడ్డాలపల్లి, పి.కొత్తపల్లి, 24న కల్లూరు-1, కేశవాపురం, 25న కల్లూరు-2, కేశవాపురం, 27న ఇల్లూరు, కొట్టాలపల్లి, 28న మర్తాడు, క్రిష్టాపురం, 29న కోటంక, బూదేడు, 30న గార్లదిన్నె-2, సంజీవపురం, 31న యర్రగుంట్ల గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి: పట్టణంలోని గాంధీ నగర్‌కు చెందిన భాగ్యలక్ష్మి అనే మహిళ ఆదివారం విష రసాయనం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సలహా మేరకు అనంతపురం ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

'కోటంక'లో ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు క్షీరాభిషేకం, పంచామృత అభిషేకం, ఆకుపూజ, అర్చనలు నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్య లో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకార్యర్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అక్రమంగా మట్టి తరలింపు


మట్టిని టిప్పర్లలో తరలిస్తున్న దృశ్యం

పుట్లూరు: మండలంలోని చాలవేముల రెవెన్యూ సరిహద్దులోని ప్రభుత్వ భూముల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. మట్టిని జేసీబీల సహాయంతో టిప్పర్లలో నింపి యల్లనూరు మండలంలోని పలు గ్రామాల రైతులకు టిప్పర్ రూ.2 వేలకు విక్రయిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. మట్టికి డిమాండ్ ఉండటంతో కొందరు తమ పట్టా భూముల్లో కొంత కాలంగా మట్టిని విక్రయిస్తున్నారు. రైతుల నుంచి వస్తున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అక్రమార్కులు ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా మట్టిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి చాలవేముల రెవెన్యూ, యల్లనూరు మండల సరిహద్దులో కొనసాగుతున్న మట్టి దోపిడీపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని మండలవాసులు డిమాండ్ చేస్తున్నారు.

జనం మెచ్చిన కవి యోగి వేమన


గుంతకల్లులో వేమన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డి సంఘం నాయకులు


గుత్తిలో వేమన జయంతిని నిర్వహిస్తున్న వేమన అభివృద్ధి కమిటీ నాయకులు

గుంతకల్లుటౌన్/గుత్తి: పండితులకే కాదు పామరులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలు చెప్పి మెప్పించిన ప్రజాకవి యోగి వేమనని సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ యుగంధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేమన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లోని వేమన విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రంగారెడ్డి, తిరుమలరెడ్డి, కార్య నిర్వాహక అధ్యక్షుడు మల్లారెడ్డి, కోశాధికారి నీలకంఠరెడ్డి, మాజీ అధ్యక్ష, కార్యదర్శులు నారాయణరెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- గుత్తి పట్టణంలోని వివేకానంద పాఠశాలలో ఆదివారం వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేమన అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ. వేమన జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలన్నారు. అలాగే వేమన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు.